క్లుప్తంగా

చట్టసభల్లో ప్రాధాన్యత కల్పించాలి


సీఎంతో సోమచంద్రశేఖర్

ఖమ్మంవన్‌టౌన్: చట్టసభల్లో అత్యధిక జనాభా కలిగిన మాదిగలకు అవకాశం కల్పించాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు, టీపీసీసీ మాజీ కార్యదర్శి వక్కలగడ్డ సోమ చంద్రశేఖర్ అన్నారు. హైదరాబాద్‌లో జరిగిన మాదిగల గ్లోబల్ సమ్మిట్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... జిల్లాలో ఉన్న రెండు ఎస్సీ శాసనసభ స్థానాలను మాల సామాజికవర్గానికి కేటాయించారని, మాదిగలకు ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. ఎమ్మెల్సీ, నామినేటెడ్, భద్రాచలం ట్రస్ట్ బోర్డు చైర్మన్ పదవుల్లో మాదిగలకు అవకాశం ఇవ్వాలన్నారు.

ముగిసిన క్రీడా పోటీలు


బహుమతులు అందజేస్తున్న దృశ్యం

ఖమ్మం స్పోర్ట్స్: నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో శ్రీ చైతన్య పాఠశాలల ఆధ్వార్యాన రెండు రోజుల పాటు జరిగిన జోనల్ స్థాయి క్రీడా పోటీలు ఆదివారం ముగిశాయి. సీనియర్, జూనియర్ బాలబాలికలకు అథ్లెటిక్స్, కబడ్డీ, వాలీబాల్, త్రోబాల్, క్యారమ్స్, చెస్ అంశాల్లో పోటీలు జరిపారు. ఖమ్మంకు చెందిన ఒలింపియాడ్ శ్రీ చైతన్య స్కూల్ జట్టు ఓవరాల్‌చాంపియన్‌గా నిలవగా, ద్వితీయస్థానంలో ఖమ్మంకు చెందిన సీబీఎస్ స్కూల్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య విద్యాసంస్థల డైరెక్టర్ మల్లెపాటి శ్రీవిద్య విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏజీఎంలు జయప్రకాష్, ప్రిన్సిపాల్స్ టీఎల్ఎన్ వర్మ, నాగప్రవీణ, ఏడుకొండలు, నీరజ, మురళిమోహన్, రవికుమార్, విజయకుమార్ పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాల సందర్శన

కామేపల్లి: మండలంలోని పాతలింగాల కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల విద్యాలయాన్ని ఇన్‌చార్జ్ డీఈఓ శ్రీనివాసరావు ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో మాట్లాడి.. పెంచిన మెనూ చార్జీలపై విద్యార్థినుల అభిప్రాయాలను సేకరించారు. అనంతరం గురుకులంలో ఉన్న స్టోర్‌ను పరిశీలించి, నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూచించారు. కొత్త మెనూ ప్రకారం విద్యార్థినులకు వడ్డన జరగాలని, లేని పక్షంలో చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. పదో తరగతి విద్యార్థినులపై ప్రత్యేక శ్రద్ధ వహించి, నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు.

అంజినిని అభినందించిన డిప్యూటీ సీఎం భట్టి

నేలకొండపల్లి: ఇటీవల జరిగిన యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన జెర్రిపోతుల అంజినిని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అభినందించారు. ఆదివారం ఖమ్మం క్యాంపు కార్యాలయంలో ఆయన్ను కలవగా అంజినిని శాలువాను కప్పి స్వీట్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ బలోపేతంలో యూత్ కాంగ్రెస్ కీలకంగా మారాలని, ప్రభుత్వం అందించే పథకాల గురించి విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. అనంతరం అంజిని కూడా భట్టిని సన్మానించారు. బచ్చలకూరి నాగరాజు, బోయిన వేణు, గాంధీ పాల్గొన్నారు.

సన్మానం


మహేష్‌ను అభినందిస్తున్న యుగంధర్

ఖమ్మంవన్‌టౌన్: ఇటీవల జిల్లా యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీగా గెలుపొందిన కుక్కల మహేష్‌గౌడ్‌ను కాంగ్రెస్ నాయకులు యుగంధర్ మంత్రి క్యాంపు కార్యాలయంలో అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పిల్లల వైద్యుడు కూరపాటి ప్రదీప్‌కుమార్, వెజెళ్ల సురేష్, మహ్మద్ ఆశ్రిఫ్, వాసు, కాటేపల్లి క్రాంతి, సురేష్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	పుష్ప 2
వినోద	పుష్ప 2
సాయిరాం	మిస్ యూ
ఆదిత్య	పుష్ప 2
శ్రీనివాస	పని
సినీ గెలాక్సీ	పుష్ప 2

- ఖమ్మంగాంధీచౌక్

హడలెత్తిస్తున్న హైవే..

- నిత్యకృత్యంగా ప్రమాదాలు
- అతివేగం, ఓవర్‌టేక్‌తో అనర్థాలు

కూసుమంచి: సూర్యాపేట–ఖమ్మం (365 బీబీ) జాతీయ రహదారిపై ప్రమాదాలు ఏదో ఒక చోట నిత్యకృత్యం అవుతున్నాయి. ఈ రహదారి పలు వాహనాలు వాటంతట అవి అదుపుతప్పుతుండగా, మరి కొన్ని వెనుక నుండి ఢీకొట్టడంతో ప్రమాదాలు తీవ్రం అవుతున్నాయి. ఈ ప్రమాదాల్లో పదుల సంఖ్యలో వాహనదారులు మృత్యువాత పడుతుండగా, వందల సంఖ్యలో క్షతగాత్రులుగా మిగులుతున్నారు. ఈ సమయాల్లో వాహనాలు ధ్వంసం అయి కొందరు ప్రాణాలు పోగొట్టుకుంటుండగా వారి కుటుంబాల్లో విషాదఛాయలు అలముకుంటున్నాయి. మనుషులే కాకుండా మూగ జీవాలు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నాయి.

ఆగని ప్రమాదాలు...

సూర్యాపేట–ఖమ్మం జాతీయ రహదారి నాలుగు వరుసలుగా విస్తరించడటంతో వాహనాల రాకపోకలకు రహదారి అనువుగా మారింది. దీంతో వాహనాలకు ఎదురువచ్చే అవకాశం లేకపోవటం, రహదారి విశాలంగా మారటంతో అతివేగంగా వెళ్తున్నాయి. దీంతో అండర్‌పాస్ వంతెనల వద్ద వాహనాలు క్రాస్ అవుతున్న సమయంలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ముందు వెళ్తున్న వాహనాలను వెనుక వేగంగా వచ్చే వాహనాలు ఢీకొడుతున్నాయి. ఇక ఓవర్‌టేక్ వలన వాహనాల స్పీడులో ఉంటుండటంతో అవి అదుపుతప్పి డివైడర్లను, వాహనాలను ఢీకొడుతున్నాయి.

80 నుంచి 100 కిలోమీటర్లకు వేగం..

ఈ జాతీయ రహదారి ప్రారంభంలో వాహనాల స్పీడును గంటకు 80 కిలోమీటర్ల వరకు పరిమితం చేశారు. కానీ రహదారి ప్రమాణాల దృష్ట్యా దాన్ని 100 కిలోమీటర్లకు పెంచారు. దీంతో కార్లు, ఇతర వాహనాలు 100 నుండి 120 వేగంతో దూసుకెళుతున్నాయి. ఈక్రమంలో వాహనాలను అదుపు చేయటం కష్టతరం అవుతుంది.

జాగ్రత్తే స్వీయ రక్షణ...

హైవేపై వాహనాలు నడిపేవారు జాగ్రత్తలు పాటించాలి. వాహనాల వేగాన్ని తగ్గించాలి. వారు తగిన రక్షణ చర్యలు తీసుకోకపోతే ప్రాణాలు గాలిలో కలిసిపోతాయి. కుటుంబాల్లో తీరని నష్టం జరుగుతుంది. ప్రతి ఒక్కరూ ప్రమాదాలను నివారించేందుకు తమ బాధ్యతగా తీసుకోవాలి. నిబంధనలు పాటించాలి. – నాగరాజు, ఎస్సై, కూసుమంచి


సూర్యాపేట–ఖమ్మం జాతీయ రహదారి

ప్రమాద ఘటనలు కొన్ని..

- జూలై 12న ఓ ట్రావెల్ బస్సు అతివేగంతో అదుపుతప్పి డివైడర్లలోకి దూసుకెళ్లగా ప్రమాదం తప్పింది.
- జూలై 24న కూసుమంచి వద్ద అంబులెన్స్ వేగంగా వచ్చి ఫ్లై ఓవర్ మధ్యలోని డివైడర్‌ను ఢీకొట్టగా డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి.
- ఆగస్ట్ 13, 15, 22 తేదీల్లో వాహనాలు అదుపుతప్పి కింద పడటంతో ఈ ప్రమాదంలో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి.
- సెప్టెంబర్ 7న జుజుల్‌రావుపేట, 9న జీళ్లచెరువు వద్ద జరిగిన ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులకు తీవ్రగాయాలయ్యాయి.
- అక్టోబర్ 2న ట్రావెల్ బస్సు హట్యాతండా సమీపంలో అతివేగంగా వచ్చి టిప్పర్‌ను ఢీకొట్టి అదుపు తప్పి సర్వీసు రోడ్డులోకి దూసుకెళ్లగా పెనుప్రమాదం తప్పింది.
- అక్టోబర్ 13న జీళ్లచెరువు వద్ద కారు అదుపు తప్పి పల్టీ కొట్టగా ఖమ్మంకు చెందిన ఒకరు మృతిచెందగా, ముగ్గురు గాయపడ్డారు.
- నవంబర్ 8న నాయకన్‌గూడెం వద్ద కారు ఆటోను ఢీకొట్టడంతో ఆటో నడుపుతున్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి.
- ఈనెల 7న కూసుమంచి సమీపంలో ఆటోను కారు ఢీకొట్టగా నాయకన్‌గూడెంకు చెందిన కూరగాయల వ్యాపారి మృత్యువాత పడ్డాడు


వేగంతో పల్టీ కొట్టిన కారు (ఫైల్)


లారీ ఢీ కొట్టడంతో మృత్యువాత పడ్డ జీవాలు (ఫైల్)


కారు ఢీకొట్టగా ఇటీవల మృతిచెందిన కూరగాయల వ్యాపారి (ఫైల్)

ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరం


కళ్లకు గంతలు కట్టి నిరసన వ్యక్తం చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

ఖమ్మం సహకారనగర్: సమగ్ర శిక్ష ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ వద్ద ధర్నాచౌక్ వద్ద ఆదివారం కళ్లకు గంతులు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘం బాధ్యులు ఝాన్సీ సౌజన్య, మహబూబ్ పాషాలు మాట్లాడుతూ... తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ నిరసన కార్యక్రమాలు చేస్తున్న ప్రభుత్వం స్పందించకపోవటం బాధాకరమన్నారు. టీజేఏసీ వైస్ చైర్మన్, ఎస్‌టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరకొండ సైదులు ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తుందన్నారు. పీఆర్‌టీయు తెలంగాణ జిల్లా అధ్యక్షులు కొమ్మినేని అనిల్‌లు మాట్లాడుతూ.. ప్రభుత్వం సమగ్ర శిక్ష ఉద్యోగులను సమస్యలను పరిష్కరించాలన్నారు. విద్యాశాఖలో విలీనం చేయాల్సిన అవసరం కూడా ఉందన్నారు. సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం సమగ్ర శిక్షా ఉద్యోగులు 'చెవిలో పువ్వు పెట్టి మా బతుకులతో ఆడుకోవద్దు' అని నిరసన కార్యక్రమం, ఈ నెల 17న సామూహిక కుటుంబంతో టీ కప్పులతో నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంగ్యా నాయక్, శోభా నాయక్, భీమా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి


నియామక పత్రం అందజేస్తున్న నరేందర్‌రావు

నేలకొండపల్లి: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, బూత్ ఎన్నికల పరిశీలకులు తక్కెళ్లపల్లి నరేందర్‌రావు సూచించారు. మండల కేంద్రంలో భువనాసి దుర్గారావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల నాటికి ప్రతీ గ్రామంలో పార్టీని బలోపేతం చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే పథకాల గురించి ప్రజలల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. నూతనంగా ఎన్నికైన బూత్ అధ్యక్షులు పార్టీని విస్తరించే పని మీద దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్, సయ్యద్ మోహినుద్దీన్, బాజా రామకృష్ణ, పిట్టల సూరిబాబు, గెల్లా నాగసాయి, యేలిగేటి వెంకటేష్, కూరపాటి రామచారీ, పులిమి వెంకటరెడ్డి, కందరబోయిన గోపి, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ చేయాలని సీఎంకు లేఖలు

కూసుమంచి: అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం అనుబంధ రైతు సంఘం ఆధ్వర్యాన పోస్ట్‌కార్డు ఉద్యమాన్ని చేపట్టారు. దీనిలో భాగంగా ఆదివారం ఆయా గ్రామాల్లోని రైతులతో రుణమాఫీ చేయాలంటూ సీఎం రేవంత్‌రెడ్డికి లేఖలు రాసి పోస్ట్ చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు తోటకూరి రాజశేఖర్, మిక్కసాని గంగాధర్ మాట్లాడుతూ... ప్రభుత్వం నాలుగు విడతల్లో రెండు లక్షలలోపు రుణాలను మాఫీ చేస్తున్నామని, చెబుతున్నా చాలామంది రైతులకు రుణమాఫీ జరుగలేదన్నారు. అందుకే తమ పార్టీ ఆధ్వర్యాన సీఎంకు రైతుల బాధలు తెలిసేలా పోస్ట్‌కార్డు ఉద్యమాన్ని చేపట్టామన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి వాస్తవాలు గ్రహించి అర్హులైన రైతులందరికీ రూ.2లక్షల రుణ మాఫీ చేయాలని డిమాండ్ చేశారు.


సీఎంకు లేఖలు పోస్ట్ చేస్తున్న రైతులు

తిరుమలాయపాలెం: రుణమాఫీ పేరుతో రైతాంగాన్ని ప్రభుత్వం మోసం చేసిందని రైతు సంఘం మండల నాయకులు తుల్లూరి నాగేశ్వరరావు ఆరోపించారు. మండలకేంద్రంలోని నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికైనా రూ.2లక్షలకు పైగా ఉన్న రుణాలపై స్పష్టత ఇచ్చి రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

ఇళ్ల స్థలాల పోరాటం ఆగదు



మాట్లాడుతున్న యర్రయ్య

ఖమ్మంఅర్బన్: పేదలకు ఇళ్ల స్థలాల విషయంలో తాము చేపట్టిన న్యాయమైన పోరాటం ఆగదని, ప్రాణం పోయినా మడమ తిప్పని విప్లకారులమని గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పడిగ యర్రయ్య అన్నారు. ఆదివారం నగరంలోని వెలుగుమట్ల గుట్టపై వినోభా నవోదయ కాలనీ 6వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. గ్రామీణ పేదల సంఘం నగర శాఖ ఆధ్వర్యంలో కాలనీ ఏర్పాటు చేసిన సభలో పార్టీ జెండాను ఆవిష్కరించి కల్తి ఎర్రబాబు అధ్యక్షత వహించిన సభలో వారు మాట్లాడుతూ.. తాగునీరు, కరెంట్ తదితర సౌకర్యాలు కల్పించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదన్నారు. జీఓ నంబర్ 58, 59 ద్వారా అక్రమార్కులకు ఒకవైపు రెగ్యూలరైజ్ చేస్తూనే, ప్రభుత్వం నుంచి అనుమతులు అర్హత ఉన్న వినోభా నవోదయ కాలనీ ప్రజలు దరఖాస్తు చేసుకున్న వాటిని పరిష్కరించలేదన్నారు. పేదల న్యాయమైన సమస్యల పరిష్కారానికి వారి నిత్యం అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ జతిన్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.విజయేంద్రరావు, నాయకులు పొలెబోయిన ముత్తయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దండా లింగయ్య, బాణాల లక్ష్మణాచారి, సంఘం ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి కల్తి రామచంద్రయ్య, షేక్ సాంద్‌మియ తదితరులు పాల్గొన్నారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు


మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ఖమ్మం సహకారనగర్: టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో నగరంలోని టీఎన్జీవోస్ ఫంక్షన్‌హాలులో సెమీ క్రిస్మస్ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, టీజేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై కేక్‌ను కట్ చేశారు. శ్రీనివాసరావు, ప్రకాశరావు, గంగవరపు బాలకృష్ణ, పొట్టపింజర రామయ్య, గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సత్యానారాయణ, వేలాద్రి, టీజేఏసీ వైస్ చైర్మన్ దేవరకొండ సైదులు, కోడి లింగయ్య, బిక్కు తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో విఫలం

కామేపల్లి: ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు మూడ్ కృష్ణప్రసాద్‌నాయక్ అన్నారు. ఆదివారం కొత్తలింగాలలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ.. వంద రోజుల్లో ఇచ్చిన హామీలు అమలు చేస్తామని ప్రజలను మభ్యపెట్టి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. ఒక హామీ కూడా అమలు చేయకుండా ప్రజాపాలన విజయోత్సవాలతో సంబురాలు చేయడం సిగ్గు చేటన్నారు. వానాకాలం, యాసంగి సీజన్‌కు సంబంధించిన రైతభరోసాను రైతుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. అన్ని సన్నరకాలకు చెందిన వరి ధాన్యాన్ని ఆంక్షలు లేకుండా ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు చేయాలన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేయాలి


మాట్లాడుతున్న మంగతాయి

ఖమ్మంరూరల్: ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేయాలని, ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో దోపిడీని అరికట్టాలని పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి ఆవుల మంగతాయి డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని ఎం.వెంకటాయపాలెంలో జరిగిన పీఓడబ్ల్యూ పాలేరు డివిజన్ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ... అందరికీ మెరుగైన వైద్యం అందాలంటే పాలకులు ప్రభుత్వాస్పత్రుల్లో అన్ని సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు శీలం. పూలమ్మ, బి. లలిత, జి. సుమతి, కళమ్మ, మమత పాల్గొన్నారు.

శత వసంతాల వేడుకలు విజయవంతం చేయాలి

ఖమ్మంఅర్బన్: సీపీఐ శత వసంతాల వేడుకను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్ అన్నారు. ఆదివారం ఖమ్మం నగరంలోని 14వ డివిజన్ కొత్తగూడెం పార్టీ కార్యాలయంలో పార్టీ సమావేశం బొమ్మిశెట్టి రామనాథం అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పగడాల మల్లేష్ మాట్లాడుతూ.. సీపీఐ ఆవిర్భావించి వందేళ్లు అవుతున్న సందర్భంగా ఈనెల 26న శత వసంతాల వేడుకను ఖమ్మంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యలే పరిష్కారంగా పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. అనంతరం ఇటీవల మృతి చెందిన పార్టీ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్‌కు నివాళులర్పించారు. 14, 15 డివిజన్ కార్యదర్శులు ప్రతాపప్ప రామనాథం, జొన్నలగడ్డ వెంకటేశ్వర్లు, ముద్రబోయిన అప్పారావు, బుడిగె వెంకన్న, చాగంటి వెంకటనర్సయ్య, భూమా రామ్మూర్తి, రావుల సంజీవరావు, హరి హుస్సేన్, పొట్ట ప్రసాద్ పాల్గొన్నారు.

ఉన్నత స్థానాలకు ఎదగాలి


సభలో మాట్లాడుతున్న బ్రదర్స్

నేలకొండపల్లి: విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలని ఎంఈఓ బాలిన చలపతిరావు అన్నారు. మండలంలోని కొత్తకొత్తూరు సెయింట్ పార్సెన్స్ స్కూల్ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో బ్రదర్ జెవీయర్ అల్గెజెండర్, మార్కెట్ కమిటీ చైర్మన్ సీతారాములు, ప్రిన్సిపాల్ జోసెఫ్ మిక్కిలి చిన్నబాబు, మాజీ సర్పంచ్ వల్లాల రాధాకృష్ణ, పేరెంట్స్ కమిటీ ప్రతినిధులు పోలంపల్లి నాగేశ్వరరావు, మల్లేల ఉపేందర్, ఖాసీం పాల్గొన్నారు.

కుటుంబం చెంతకు..


కాంతారావును కుటుంబసభ్యులకు అప్పగిస్తున్న శ్రీనివాసరావు

ఖమ్మంఅర్బన్: మతిస్థిమితం లేని వ్యక్తిని ఆదివారం కుటుంబం చెంతకు చేర్చినట్లు అన్నం ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు తెలిపారు. నగరంలోని బైపాస్‌రోడ్డులో మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న వ్యక్తిని పోలీసుల సమాచారం మేరకు అన్నం ఆశ్రమంకు తీసుకొచ్చారు. సదురు వ్యక్తి కోలుకుని తాను ములుగుజిల్లా మంగపేటలోని తిమ్మంపేటకు చెందిన గట్టిపెల్లి కాంతారావు అని తెలపడంతో వివరాలు గుర్తించి ఫౌండేషన్ అంబులెన్స్‌లో ఖమ్మం నుంచి తిమ్మంపేటకు తీసుకెళ్లి అప్పగించారు. తమ కుమారుడిని గుర్తించి తమకు అప్పగించినందుకు కాంతారావు తండ్రి బాలయ్య అన్నం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

రైతాంగ ఉద్యమంపై అణచివేత ధోరణి సరికాదు

ఖమ్మం మామిళ్లగూడెం: రైతాంగ ఉద్యమంపై మోదీ ప్రభుత్వం అణిచివేత ధోరణి అవలంబిస్తుందని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం (ఏఐపీకేఎస్) అధ్యక్ష, కార్యదర్శులు మలీదు నాగేశ్వరరావు, ఆవుల వెంకటేశ్వర్లు అన్నారు. ఈ మేరకు ఆదివారం మాట్లాడుతూ.. శంభు సరిహద్దులో భాష్ప వాయుగోళాల ప్రయోగం సిగ్గు చేటన్నారు. ఢిల్లీ సరిహద్దులో ముళ్ల కంచెలు, రోడ్లపై మేకులు, ఇనుప బారికేడ్లతో దాడిని ఖండించారు. 101 మంది అన్నదాతలను రైతులేనా రుజువు చేసుకోండని పోలీసులు అడ్డగించడం సరికాదన్నారు. ఢిల్లీ వైపు వెళ్లనీయకుండా లాఠీచార్జి చేయడం అప్రజాస్వామిక చర్య అవుతుందన్నారు.

ఘనంగా దత్త జయంతి వేడుకలు


శ్రీ కృష్ణ ఆశ్రమంలో...


షిర్డీ సాయి మందిరంలో దత్త హోమం..

ఖమ్మంగాంధీచౌక్: మార్గశిర పౌర్ణమి సందర్భంగా నగరంలోని గాంధీచౌక్ వరప్రదాత శ్రీ షిర్డీ సాయి మందిరంలో ఆదివారం దత్తజయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 27 కలశాలతో పంచామృత అభిషేకం, గణపతి పూజ, పుణ్యాహవచనం, శ్రీరుద్ర సహిత దత్తాత్రేయ హోమం, పూర్ణాహుతి అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో సాయి మందిర చైర్మన్ డాక్టర్ వేములపల్లి వెంకటేశ్వరరావు సామ్రాజ్య లక్ష్మీ, అర్వపల్లి నిరంజన్, కురువెళ్ల జగన్మోహన్ రావు, గన్నవరపు నాగేశ్వరరావు, ప్రసాద్, సూర్యనారాయణ, రమాదేవి, వెంకటేశ్వర్లు, వెంకటలక్ష్మీ, శ్రీను, లక్ష్మీ, స్రవంతి, నికిత ఉన్నారు. అదేవిధంగా నగరంలోని త్రీటౌన్ శ్రీ కృష్ణ సాయి ఆశ్రమంలో 108 కలశాలతో ప్రత్యేక అభిషేక కార్యక్రమం చేశారు. ఆశ్రమం చైర్మన్ లగడపాటి రామారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రూప్–2 పరీక్ష

గ్రూప్–2 పరీక్ష తొలిరోజు ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. ఈ సందర్భంగా పరీక్షకేంద్రాల్లో నియమ నిబంధనల అమలుకు అధికారులు పటిష్టంగా చర్యలు చేపట్టారు. ప్రతీ ఒక్కరిని క్షుణ్ణంగా తనిఖీ చేసి కేంద్రాల్లోకి పంపించారు. పలువురు కేంద్రాలకు ఆలస్యంగా రావడంతో నిలిపివేయడంతో పరీక్షరాయకుండా వెనుదిరిగారు. – సాక్షి నెట్‌వర్క్


పరీక్ష రాసి వస్తున్న అభ్యర్థులు


సమయం మించిపోవడంతో గేట్లు వేస్తున్న సిబ్బంది


బ్యాగులు సెల్ ఫోన్లతో నిండిపోయిన కౌంటర్


ఎండలోనే భోజనాలు చేస్తున్న అభ్యర్థులు



గేటు వద్ద ఆగిపోయిన అభ్యర్థులు